నత్తనడకన కౌలు రైతుల గుర్తింపు

- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా మొదలుకాని కార్డుల జారీ
- 2024–25లో సీసీఆర్ కార్డుల లక్ష్యం 3,465
- ఆవేదనలో కౌలు రైతులు


కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరుతూ గురువారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

ఆలూరు రూరల్: పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రం కౌలు రైతులకు ఎంతో విలువైంది. ఈ పత్రం ఉంటే ఎరువులు, విత్తనాలు రాయితీపై లభిస్తాయి. బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయి. విపత్తుల సమయంలో పంట నష్టపరిహారం అందుతుంది. ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం అందాలంటే ఈ కార్డే ఆధారం. ఇంతటి ప్రాధాన్యమున్న కార్డుల జారీలో ప్రభుత్వ నిర్లక్ష్యం కౌలు రైతులను ఆందోళన, ఆవేదనకు గురిచేస్తోంది.

కౌలు రైతులను గుర్తించడంలో అలసత్వం

ఆలూరు నియోజకవర్గంలో కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఈ ఏడాది కౌలు రైతులకు అందించే సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలు (సీసీఆర్‌సీ) అందుతాయో లేదోనని రైతులు ఆందోళన పడుతున్నారు. సీసీఆర్‌సీ కార్డులు లేకపోతే అందాల్సిన ప్రయోజనాలు అందవని కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కౌలు రైతులకు అన్ని విధాలా మేలు జరిగింది. వారికి సీసీఆర్‌సీ కార్డులు అందజేయడంతో పాటు విత్తనాలు, ఎరువులు కూడా అందించింది. అంతేగాకుండా సాధారణ రైతులకు ఇచ్చిన విధంగా వారికి వైఎస్సార్ రైతు భరోసా ఆర్థిక సాయాన్ని అందించింది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు కావొస్తున్నా టీడీపీ ప్రభుత్వం కౌలు రైతు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియను ఇంకా ప్రారంభించనే లేదు.

ఈ ఏడాది 3,465 కౌలు కార్డుల జారీ లక్ష్యం

గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో 3 వేల మందికి సీసీఆర్ కార్డులు అందించారు. ఈ ఏడాది 3465 మందికి కౌలు రైతు కార్డులు అందజేయాలని కొత్త ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యింది. రైతులు కొన్ని చోట్ల పంటల సాగు ప్రారంభించగా మరికొన్ని చోట్ల పొలాలను సిద్ధం చేస్తున్నారు. కార్డుల జారీలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంపై రైతులు ఆవేదన చెందుతున్నారు. అసలు అందుతాయా.. లేదా అన్న సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు పెట్టుబడి భరోసా నిధులు కూడా విడుదల చేయకపోవడంతో రైతన్నకు కష్టాలు తప్పేలా లేవని వాపోతున్నారు.

వేగవంతం చేస్తాం



ఈ ఏడాది పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాల జారీ లక్ష్యం 3,465గా నిర్ణయించారు. ప్రస్తుతం విత్తనాల పంపిణీ పూర్తి చేశాం. రెండు మూడు రోజుల్లో సీసీఆర్‌సీ కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం అవుతుంది. భూ యజమానులు కౌలుకు ఇచ్చిన భూమి గతంలో ఇచ్చిన వారికే ఇచ్చారా..లేక వారే వారు సాగు చేస్తున్నారా అనేది కొన్ని మండలాల్లో తేలాల్సి ఉంది. అర్హులైన కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేస్తాం.

– సునీత, ఏడీఏ, ఆలూరు

ప్రశాంతంగా వేలం పాటలు


వేలంపాట నిర్వహిస్తున్న డీఎల్‌పీఓ నూర్జహాన్

కౌతాళం: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో వివిధ పన్నుల వసూలుకు సంబంధించి వేలం పాటను గురువారం సర్పంచ్ పాల్‌దినకర్ అధ్యక్షతన డీఎల్‌పీఓ నూర్జహాన్ నిర్వహించారు. కమేలా వేలం పాటను ఏరిగేరి నబామ్మ రూ.33 వేలకు సొంతం చేసుకోగా బండిమెట్ట, దినసరి మార్కెట్ వేలం పాటలు వాయిదా పడ్డాయి. అలాగే మండల పరిధిలోని హాల్వి గ్రామంలో వేలం పాటలు నిర్వహించారు. బండిమెట్ట రూ.4.71 లక్షలకు కురవ నాగేష్ దక్కించుకోగా, వారపు సంత రూ.15 వేలకు మారెన్న సొంతం చేసుకున్నారు. వేలం దక్కించుకున్న వారికి జులై 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 30వ తేదీ వరకు 9 నెలల పాటు నిర్వహణ హక్కులు లభిస్తాయని డీఎల్‌పీఓ తెలిపారు. ఈఓపీఆర్‌డీ జనార్దన్, ఆయా గ్రామాల కార్యదర్శులు, శివప్ప, కరీం, గ్రామ సర్పంచ్ క్రాంతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్థికసాయం

మద్దికెర : మండల కేంద్రానికి చెందిన టైలర్ వలి పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబానికి మండల టైలర్ల సంఘం సభ్యులు గురువారం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. సంఘం అధ్యక్షుడు రఘు, టైలర్లు హరి, అస్లాం, చంద్ర పాల్గొన్నారు.

క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలి


ట్యాంకును పరిశీలిస్తున్న అధికారులు

మద్దికెర: మండలంలోని మంచినీటిని సరఫరా చేసే ట్యాంకులను శుభ్రం చేయడమే గాకుండా క్లోరినేషన్ చేయించిన తర్వాతే నీటిని సరఫరా చేయాలని ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ తెలిపారు. గురువారం స్థానిక నంద్యాల నీటి పథకం వద్దనున్న ట్యాంకులను శుభ్రం చేయడాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండలంలో 16 ఓహెచ్ ట్యాంకులు, 4 గ్రౌండ్ లెవెల్ ట్యాంకులున్నాయన్నారు. వాటిన్నంటిని శుభ్రం చేయించామని చెప్పారు. అతిసారా ప్రబలుతుండడంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. సిబ్బంది విజయ్ ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తుగ్గలి: వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో సీజనల్ వ్యాధుల నివారణపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నిరంతం అప్రమత్తంగా ఉంటూ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీ లైనా, పారిశుద్ధ్యం లోపించినా వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డయేరియా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలితే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని చెప్పారు. సీహెచ్‌వో అన్నపూర్ణ, పీహెచ్‌ఎన్ సరస్వతి, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటరమణయ్య, నాగమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ కార్యదర్శులు పాల్గొన్నారు .

విద్యా సామగ్రి పంపిణీ

దేవనకొండ: మండలంలోని నేలతలమరి గ్రామంలోని పాఠశాలలో గురువారం టీడీపీ నాయకులు విజయ్‌భాస్కర్‌గౌడ్, సర్పంచ్ నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, యూనిఫాంలను అందించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.

అధిక ఫీజులను నియంత్రించాలి

ఆస్పరి: ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. ఆయన గురువారం ఆస్పరిలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రైవేట్ విద్యా సంస్థల వారు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టి అధిక ఫీజులు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మార్సీకి చేరిన పుస్తకాలు


కృష్ణగిరి ఎమ్మార్సీ కార్యాలయంలో ఉన్న పుస్తకాలు

కృష్ణగిరి: ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి స్పెల్–4 కింద గురువారం పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈఓ–2 మద్దయ్య తెలిపారు. 7వ తరగతితో పాటు మిగతా తరగతులకు సంబంధించి 9,700 పుస్తకాలు వచ్చాయని, వీటిని త్వరలో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేస్తామన్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో మండలంలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి, తొగర్చేడు ప్రాథమికోన్నత పాఠశాలలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అయ్యాయని చెప్పారు. వీటిల్లో ఈ ఏడాది తొమ్మిదో తరగతి ప్రారంభం అవుతుందని, వచ్చే ఏడాది పదో తరగతి నిర్వహిస్తారని వివరించారు.

జూటూరులో పారిశుద్ధ్య పనులు

పత్తికొండ రూరల్ : మండలంలోని జూటూరు గ్రామంలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి సాలెహా బొఖారియా ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది మురుగుకాల్వలు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అనంతరం తాగునీటి ట్యాంకులను శుభ్రం చేశారు. ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా పారిశుద్ధ్య సమస్య తలెత్తినా వెంటనే కార్యాలయంలో తెలియజేయాలని చెప్పారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.


ఎల్లార్తి దర్గాలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు


ఎల్లార్తి దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

హొళగుంద: మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో వెలిసిన శేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. దర్గాలో మొక్కులు చెల్లించుకోవడానికి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొని దేవుళ్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డీ సాయిబాబా ఆలయాలను భక్తులు దర్శనం చేసుకున్నారు. తీర్థ ప్రసాద పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

తుంగభద్రకు తగ్గుతున్న ఇన్‌ఫ్లో

- 5 టీఎంసీలకు పడిపోయిన నీటి నిల్వ
- ఎగువ భాగంలో నిరాశాజనకంగా వర్షాలు


తుంగభద్ర రిజర్వాయర్

హొళగుంద: ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి రిజర్వాయర్, జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు వరప్రదాయిని తుంగభద్ర డ్యాంలో నీరు అడుగంటింది. కొద్ది రోజుల క్రితం ఇన్‌ఫ్లో కాస్త పెరిగి నీటి నిల్వ 6 టీఎంసీలు దాటింది. ఈ స్థితిలో ఎగువ భాగంలో వర్షాలు నిరాశజనకంగా ఉండడంతో నీటి నిల్వ 5 టీఎంసీలకు పడిపోయింది. దీంతో జలాశయంలో ఆశించిన స్థాయిలో నీరు లేక కళ తప్పింది. జలాశయం పూర్తి సామర్థ్యం 1633 అడుగులతో 105.788 టీఎంసీలుండగా గురువారం 1581.25 అడుగులతో 5.110 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 582, అవుట్‌ఫ్లో 751 క్యూసెక్కులుంది. కర్ణాటకతో పాటు ఆంధ్రాకు సంబంధించి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు సాగు, తాగునీరును అందిస్తున్న టీబీ డ్యాం గత రెండేళ్లుగా అన్నదాతలను నిరాశపరుస్తోంది. తుంగభద్ర జలాశయ పైభాగంలోని ఆగుంబే, వరనాడు, శివమొగ్గ, తీర్థనహళ్లి, శృంగేరి తదితర ఉత్తర కర్ణాటక ప్రాంతాల్లో వర్షాలు తగ్గడంతో ఎగువ నుంచి వరద లేకపోవడంతో తుంగభద్ర జలాశయం నీరు లేక బోసిపోతోంది. అయితే ఆగస్టు వరకు వర్షాలు కురిసే అవకాశాలుండడంతో రైతులు డ్యాం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఖరీఫ్‌పై కార్యాచరణ రూపొందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రవి

మద్దికెర : ఖరీఫ్ సీజన్‌పై కార్యాచరణ రూపొందించి పంటల సాగుపై రైతులకు సూచనలిచ్చి అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని వ్యవసాయాధికారి రవి సూచించారు. గుడవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రాబోవు వారంలో మట్టి నమూనాలు సేకరించాలన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ధ్రువీకరణ పూర్తి చేయాలని చెప్పారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకనుగుణంగా పత్తిలో రసం పీల్చే పురుగుల ఉధృతి తగ్గించుకోడానికి ఇమిడాక్లోపిడ్ 70–100 ఎంఎల్ ఎకరాకు లేదా మోనోక్రోటోఫాస్ 2 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే..వేరుశనగలో రసం పీల్చు, ఆకుముడత పురుగుల నివారణకు సోలమన్ 1 ఎంఎల్ లీటర్ నీటికి, పెండల్ 2 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని వివరించారు. ఏఈఓ భోజరాజు, సహాయకులు జాకీర్, ఆనంద్, రాణి పాల్గొన్నారు.

మలేరియా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర : దోమల వల్ల వ్యాపించే మలేరియా వ్యాధి పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా స్థానిక కొండమ్మబావి ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో వైద్య సిబ్బందితో పాటు ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి మందులు పిచికారీ చేయించాలని చెప్పారు. ఖాళీ టైర్లలో, కుండీలు, తొట్టెలు, డ్రమ్ములు నీటిని నిల్వ ఉంచుకోవద్దని ప్రజలకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, సీహెచ్‌ఓ నిరంజన్, మలేరియా సబ్ యూనిట్‌అధికారి వెంకటేశులు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం


ఆలూరు నర్సరీలో నేరేడు చెట్లను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ఆలూరు రూరల్/దేవనకొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా హార్టికల్చర్ కింద పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి సూచించారు. ఆయన గురువారం ఆలూరు ఉపాధి హామీ క్లస్టర్ పరిధిలోని ఏపీఓలు, టీఏలు, ఈసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద 16 రకాల మొక్కలను వంద శాతం ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. పండ్ల తోటల అభివృద్ధితో పాటు పచ్చదనం పెంపునకు ఉపాధి హామీ యంత్రాంగం కృషి చేయాలన్నారు. ఈ ఏడాది ఆలూరు క్లస్టర్ పరిధిలోని 5 మండలాల్లో 1,720 ఎకరాల్లో పండ్ల తోటల సాగు చేపట్టేలా లక్ష్యం నిర్దేశించామన్నారు. ఇప్పటివరకు 1,230 ఎకరాల్లో సాగు లక్ష్యం పూర్తి చేసినట్లు చెప్పారు. ఉపాధి హామీ జాబ్ కార్డుతో పాటు ఐదెకరాల్లోపు పొలం కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్నకారు రైతులను అర్హులుగా పేర్కొన్నారు. గులాబీ, మల్లెతో సహా మామిడి, బత్తాయి, నేరేడు, జామ, సీతాఫలం, మునగ, సపోట, కొబ్బరి, దానిమ్మ, చింత వంటి తోటలు అభివృద్ధి చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆలూరు నర్సరీలో అందుబాటులో ఉన్న 3 వేల మునగ మొక్కలను ప్రతి గ్రామంలో ఇంటి ఆవరణలో నాటుకునేందుకు ప్రజలకు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. హార్టికల్చర్ జిల్లా మేనేజర్ నంద కిషోర్, ఆలూరు ఏపీడీ పద్మావతి, సీఎల్‌ఆర్‌సీ కోర్స్ డైరెక్టర్ సురేష్‌బాబు, ఏపీఓలు, టీఏలు, ఈసీలు ఉన్నారు.

→ రైతులు పండ్ల తోటల సాగులో రాణించాలని డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం దేవనకొండలోని స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు క్లస్టర్ లెవెల్ సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. పండ్లతోటల సాగు చేపట్టిన రైతులకు అందిస్తున్న రాయితీలను వివరించారు. ఏపీడీ పక్కీరప్ప, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

వెల్దుర్తి(కృష్ణగిరి): కాకినాడలో జూలై 8 నుంచి 10వ తేదీ వరకు జరిగే ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్రస్థాయి వైద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు సోమన్న కోరారు. వెల్దుర్తిలో గురువారం శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు రాజకీయాలపైనా ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థి దశలోనే నేర్చుకోవాలన్నారు. కేవలం చదువే కాకుండా సమాజానికి ఉపయోగపడేలా, విద్యావ్యవస్థలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు తదితర అంశాలను తెలియజేయడమే కాకుండా వివిధ అంశాలపై శిక్షణ ఇస్తారని చెప్పారు. అలాగే వెల్దుర్తిలో బీసీ–2 హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పృథ్వి, అఖిల్‌సాయి పాల్గొన్నారు.

ఫిల్టర్‌బెడ్‌కు తరచూ నిలిచిపోతున్న నీటి పంపింగ్

హొళగుంద: స్థానిక ఫిల్టర్‌బెడ్‌కు తరుచుగా నీటి సరఫరా నిలిచిపోతుండడంతో ఇటు గ్రామస్తులు, అటు పంచాయతీ సిబ్బంది ఇబ్బందులకు గురౌతున్నారు. ఈ సమస్యతో గ్రామంలోని ఆయా కాలనీలకు వారానికి ఒకసారి కూడా నీటిని సరఫరా చేయలేక పోతున్నామని వాటర్‌మెన్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోజుల తరబడి నీరు రాకపోవడంతో ప్రజలు పంచాయతీ కార్యలయానికి వచ్చి అధికారులను, సిబ్బందిని నిలదీస్తున్నారు. ఎల్లెల్సీలో నీటి సరఫరా లేకపోవడంతో కడ్లమాగి వద్ద నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి ఫిల్టర్‌బెడ్‌కు వచ్చిన నీటిని మాత్రమే గ్రామంలో సరఫరా చేయాల్సి ఉంది. అయితే కాలువలో నీరుంటే ఎస్‌ఎస్ ట్యాంకు నుంచి నీరు రాకపోయినా కాలువ నీటిని నేరుగా ఫిల్టర్‌బెడ్‌కు పంపించి గ్రామంలో సరఫరా చేసే వాళ్లమని ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో ట్యాంకు నీటి మీదే ఆధారపడాల్సి ఉంటుందని పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ తెలిపారు. ఎస్‌ఎస్ ట్యాంకు నీటిని ఫిల్టర్‌బెడ్‌కు పంపించే విషయంలో పలు సందర్భాల్లో లీకేజీలు, విద్యుత్ సమస్య, పల్లెలకు మళ్లించడం వంటి కారణాలు ఉంటున్నాయి. అయితే మేజర్ గ్రామానికి నీటి సరఫరా విషయంలో పైసమస్యలు తురుచూ తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుని తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సబ్సిడీ విత్తనాలు అందించాలి

ఆలూరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఇబ్బంది కలగకుండా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులను అందించేలా చర్యలు చేపట్టాలని సీపీఐ నాయకులు వ్యవసాయ శాఖ అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ చంద్రశేఖరయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, చంద్రకాంత రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లను అందించాలన్నారు. ఖరీఫ్ పంటల సాగుకు పెట్టుబడి సాయం అందకపోవడం, సబ్సిడీ విత్తనాలను మంజూరు చేయకపోవడం, బ్యాంకులలో రుణాలు మంజూరు గాక రైతులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధానంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులను అందజేసి రుణాలు మంజూరయ్యేలా అధికారులు, నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు పులి, రంగన్న, శివరాజ్, బండయ్య తదితరులు ఉన్నారు.

దర్గాలో భక్తుల సందడి


ఖాదర్ లింగస్వామి సమాధి

కౌతాళం: కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు. భక్తులకు ధర్మకర్త అన్నదానం ఏర్పాటు చేశారు.

కమ్యూనిటీ హాళ్లకు మోక్షం కలిగేనా!

- 20 ఏళ్ల క్రితం నిర్మాణాలు ప్రారంభం
- నిధులు చాలక ఆగిన పనులు
- శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకోలేక ప్రజల ఇబ్బందులు
- ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలంటున్న జనం


గుండాలతండాలో నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్ నిర్మాణం

తుగ్గలి : మండలంలోని పలు గ్రామాల్లో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. 20 ఏళ్ల క్రితం మండలంలోని చిగుర్లుగుట్ట తండా, చెర్వుతండా, లక్ష్మితండా, గుండాలతండా, జొన్నగిరి, చెన్నంపల్లి, ముక్కెల్లలో కమ్యూనిటీ భవన నిర్మాణాలకు అప్పట్లో రూ.1.50 లక్షల చొప్పున మంజూరయ్యాయి. రూఫ్ లెవెల్ వరకు పనులు చేసిన కాంట్రాక్టర్లు నిధులు చాలకపోవడంతో అర్ధాంతరంగా ఆపేశారు. శుభ కార్యాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉండటానికి నిర్మించాలనుకున్న కమ్యూనిటీ భవనాల పనులు నిధుల కొరతతో నిలిచిపోయాయి. అప్పటి నుంచి వాటి నిర్మాణాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచి పోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని అసంపూర్తిగా నిలిచిన భవనాలను పూర్తి చేసేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఆలూరు: ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి సూచించారు. చిప్పగిరిలో గురువారం వివిధ గ్రామాల రైతులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మండల స్థాయి అధికారులు ఆయన్ను కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో అదనంగా సీట్లను మంజూరు చేయాలని కోరారు. సీజనల్ వ్యాధుల నివారణపై పీహెచ్ కేంద్రాలు, సీహెచ్ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రధానంగా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, నీటి ఎద్దడిని నెలకొన్న గ్రామాలపై త్వరలో జిల్లా స్థాయి అధికారులకు నివేదిక అందిస్తామన్నారు. అలాగే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఇబ్బంది కలగకుండా విత్తనాలు, ఎరువుల అందుబాటులో ఉంచాలని సూచించారు.

వాతావరణ సమాచార కేంద్రానికి గ్రహణం


ఆలూరులో వాతావరణ సమాచార కేంద్రం చుట్టూ పెరిగిన ముళ్ల పొదలు

ఆలూరు: వాతావరణంలో వచ్చే మార్పులు, వర్షపాత సమాచారాన్ని తెలియజేసేందుకు ప్రతి మండల, నియోజకవర్గ కేంద్రంలో ఆటోమేటిక్ వాతావరణ సమాచార కేంద్రాలను అధికార యంత్రాంగం ఏర్పాటు చేసింది. భూ ఉపరితల శీతోష్ణస్థితితో పాటు ఖరీఫ్, రబీ సీజన్లలో వర్షపాతం వివరాలను అందించేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడుతున్నాయి. అయితే స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వాతావరణ సమాచార కేంద్రం చుట్టూ ముళ్ల కంపలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆ కేంద్రం వైపు రెవెన్యూ, గణాంక శాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. దీంతో వేలాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన వాతావరణ సమాచార కేంద్రం నిరుపయోగంగా మారింది. ఈ కారణంగా వర్షపాత వివరాలు, వాతావరణ సమాచారం తెలుసుకునేందుకు వీల్లేకుండా పోయింది. దీంతో సరైన సమాచారం అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమాచార కేంద్రం చుట్టూ ఏపుగా పెరిగిన ముళ్ల కంపలను తొలగించాలని స్థానిక రైతులు, ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుగ్గలి: తుగ్గలి, జొన్నగిరి సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ మండల ఏఈ మహేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. 33 కేవీ లైన్‌లో ఒరిగిన స్తంభాలు సరిచేస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

అర్హులందరికీ కుల ధ్రువీకరణ పత్రాలు


ఆలూరులో కుల ధ్రువీకరణ పత్రాల జారీ కోసం విచారణ చేస్తున్న వీఆర్వోలు

ఆలూరు రూరల్: మండలంలో కుల ధ్రువీకరణ పత్రం పొందని వారందరికీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు గత ప్రభుత్వ హయాంలో చేసిన కుల గణనలో ఆలూరు మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలోని 21 గ్రామాల్లో 5,416 కుటుంబాలు కుల ధ్రువీకరణ పత్రాలు పొందలేదని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నుంచి ఆ గ్రామాల వీఆర్వోల ద్వారా ఆయా కుటుంబాల వద్దకు వెళ్లి వివరాలు సేకరించి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఆదేశించామన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

75శాతం రాయితీతో గడ్డి విత్తనాలు


వెల్దుర్తి పశువైద్యశాలలో రికార్డులను పరిశీలిస్తున్న జేడీ శ్రీనివాసులు

వెల్దుర్తి(కృష్ణగిరి): నీటి వసతి కలిగిన రైతులకు 75 శాతం రాయితీతో గడ్డి విత్తనాలు అందిస్తామని, అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పశు వైద్యశాలను గురువారం తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలకు వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేస్తున్నామన్నారు. కుక్కలకు రేబిస్ టీకాను జూలై 6న ప్రత్యేకంగా వేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. పంచాయతీల పరిధిలోని కుక్కలతోపాటు, పెంపుడు కుక్కలకు కూడా యజమానులు టీకాలు వేయించాలన్నారు. స్థానిక పశువైద్యాధికారిణి శాంతలత, జిల్లా పశువైద్య శాఖ మేనేజర్ జవహర్, స్టాటిస్టికల్ అధికారి క్రిస్టఫర్ ఉన్నారు.